క్లుప్తంగా

చేనేత, హస్తకళలను ఆదరించాలి



వస్త్రాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చేనేత, హస్తకళలను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో క్రాఫ్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేత కళాకారులకు అండగా నిలిచారని చెప్పారు. వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాలతో పాటు బెంగాలీ కాటన్, సహరన్ పూర్ కలప వస్తువులువంటి ఎన్నో వస్తువులను ఈ ప్రదర్శనలో ఉంచామని, ఇది సంక్రాంతి పండుగ వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

టీ షర్టులు, బాక్సుల పంపిణీ



విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు పరిసర ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం టీ షర్టులు, హాట్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ క్రీడల సందర్భాల్లో ధరించడానికి వీలుగా టీ షర్టులు పంపిణీ చేశామన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన 160 మందికి టీషర్టులు, హాట్ బాక్సులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎం మాలతీ దేవి, బీసీహెచ్ దుర్గాంబ, ఎన్ జై కుమార్, ఎన్ రాజు, పాఠశాల విద్యాకమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు మెరుగైన సేవలు అందించాలి



పత్తేబాద నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించిన రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్) : వృద్ధులకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఆదేశించారు. స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆయన బుధవాం సందర్శించారు. వృద్ధులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత, వైద్యసదుపాయాలు, సీనియర్ సిటిజన్స్ యాక్ట్ పై అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాల కోసం న్యాయ సహాయం పొందాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హోమ్ నిర్వాహకులను రత్నకుమార్ ఆదేశించారు.

రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా కోరింది. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా కార్యాలయం నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ కొద్దిసేపు ధర్నా చేశారు. ఈ మేరకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కోడూరి లక్ష్మీనారాయన, విక్రమ కిషోర్, పెన్మత్స రామచంద్రరావు, నడపన దానభాస్కరరావు, ఇలపకుర్తి కుసుమ కుమారి, నాగం శివ, గాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదుకుంటున్న ఆరోగ్యశ్రీ

- 15 గ్రామాల్లో 1999 మంది రోగులకు రూ.7.34 కోట్లు మంజూరు
- ఆరోగ్య ఆసరాలో రూ.83.25 లక్షల భృతి

ఏలూరు రూరల్: పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి. ఆరోగ్యశ్రీని ఏడాదికి రూ.2 లక్షల ఆదాయం గల కుటుంబాలకు వర్తింపుజేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. మహానేత వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారు. ఏడాదికి రూ.5 లక్షల ఆదాయం గల వార్కి ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తున్నారు. ఈ పథకంలో ఉన్న 1059 వైద్య సేవలను 3,257కు పెంచారు. ఫలితంగా గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కేన్సర్ తదితర జబ్బులతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలకు సైతం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్య సేవలు అందుకునే అవకాశం ప్రజలకు దక్కింది. గర్భిణులు ఇంటి వద్దే డెలివరీ అయితే రూ.7 వేలు అందిస్తోంది. దీనికి తోడు మరో రూ.5 వేల భృతి కూడా ప్రభుత్వం చెల్లిస్తోంది.

అందుబాటులో సేవలు

ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే ఆరోగ్య మిత్ర ద్వారా ఉచిత అడ్మిషన్, రోజూ డాక్టర్ చెకప్, నర్సింగ్ సేవలు, వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు, శస్త్ర చికిత్స, అవసరమైన ఇంప్లాంట్లు, చికిత్స సమయంలో



ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కౌంటర్ వద్ద సేవలు పొందుతున్న ప్రజలు

అల్పాహారం, భోజనం, ఇంటికి వెళ్లే చార్జీల ఖర్చు, 10 రోజులు తర్వాత ఉచిత పరీక్షలు, మందులు అందుకోవచ్చు.

రూ.కోట్ల ఖర్చు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో ఏలూరు రూరల్ మండలంలో 1999 మంది పేదలు ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్య సేవలు పొందారు. వీరి కోసం ప్రభుత్వం రూ.7,34,39,871 ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించింది. ఇందులో చాటపర్రు గ్రామస్తులకు రూ.1,06,26,069, పైడిచింతపాడుకు రూ.49,77,955, ప్రత్తికోళ్లలంక రూ.91,77,721, కోటేశ్వరదుర్గాపురం రూ.17,59,346, కోమటిలంక రూ.14,70,476, శ్రీపర్రు రూ.1,00,38,540, పెదయాగనమిల్లి రూ.5,87,954, గుడివాకలంక రూ.1,09,65,871, జాలిపూడి రూ.80,23,128, మల్కాపురం రూ.51,83,420, మాదేపల్లి రూ.1,06,29,391లను ఖర్చు చేసింది.

ఆరోగ్య ఆసరా

పేదలకు సేవ చేయడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు వరుసలో నిలిచింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు పొందిన రోగులకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం అమలు చేస్తోంది. పలు రకాల జబ్బులకు ఆపరేషన్ లేదా చికిత్స పొందిన రోగులకు విశ్రాంతి సమయంలో సైతం భృతి కల్పిస్తోంది. రోజుకు రూ.225 చొప్పున నెలరోజులకు సుమారు రూ.5 వేలు ఖర్చులకు అందిస్తోంది. ఈ మొత్తం అందుకుంటున్న పేద కుటుంబాలు తిరిగి కోలుకునే వరకు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతున్నారు. మొత్తంగా మండలంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు పొందిన రోగులకు రూ.83,25,975 భృతి రూపంలో ప్రభుత్వం అందించింది.



ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళను వైద్యుడు వద్దకు తీసుకెళుతున్న ఆరోగ్యమిత్ర (ఫైల్)

ఆరోగ్యశ్రీ వల్లే బతికాను



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నేను గుండె ఆపరేషన్ చేయించుకున్నాను. ఈ పథకం వల్లే నేను ఈ రోజు జీవిస్తున్నాను. ఆరోగ్య శ్రీ లేకపోతే ఖరీదైన వైద్యం నాకు దక్కేది కాదు. నా కోసం కుటుంబం రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చేది. నాలాంటి పేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం ఎంతో మేలు చేస్తోంది.

– పసుపులేటి సుబ్బలక్ష్మి, చాటపర్రు

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేదలకు వరం వంటిది. ఆరోగ్య శ్రీ లేకపోతే పేదల కష్టార్జితం అంతా ఆసుపత్రులకే పోయాల్సి వచ్చేంది. ఆపరేషన్ చేయించుకున్న తర్వాత కూడా ప్రభుత్వం నాకు రూ.5 వేలు జీవన భృతి ఇచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

– కడలి మహేశ్వరి, చాటపర్రు

వైఎస్సార్ చిరస్మరణీయుడు



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడు. ఆయన వల్ల ఎందరో పేదలు గుండె జబ్బులు చేయించుకుని మరో జన్మెత్తారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే 3,257 రకాల సేవలను 2,285 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పొందే అవకాశం కల్పించడం గొప్ప విషయం.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

విద్యారంగాల్లో విప్లవాత్మక మార్పులు



23వ డివిజన్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్లు శ్రీనివాస్, సుధీర్‌బాబు



18వ సచివాలయం పరిధిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న జిల్లా కోశాధికారి మైబాబు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని ప్రభుత్వ విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తే పేదలకు నాణ్యమైన విద్యకు బాటలు వేశారని ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు అన్నారు. ఏలూరు నగరంలో 23, 32 డివిజన్లు, వన్‌టౌన్‌లోని 8వ డివిజన్, టూటౌన్‌లోని 35, 43, 44 డివిజన్ల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, గృహసారథులు హాజరై సీఎం జగనన్న అందిస్తోన్న పథకాలను ప్రజలకు వివరించారు. తొలుత పార్టీ జెండాలను ఆవిష్కరించి, సంక్షేమ బోర్డులను ప్రదర్శించారు.

ఏలూరు 23, 32 డివిజన్లల్లో జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను సమూలంగా మార్పు చేస్తూ ప్రభుత్వ బడులను నాడు – నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారని తెలిపారు. పేదవర్గాల పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేస్తూ నాణ్యమైన విద్యనందించేలా అనేకమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, పార్టీ నాయకులు ఉన్నారు.



54వ సచివాలయం పరిధిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న క్లస్టర్-1 మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ సదానందం

18వ సచివాలయం పరిధిలో..

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, క్లస్టర్-3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పిల్లలకు పాఠ్యపుస్తకాలు సరైన సమయానికి అందే పరిస్థితి లేవని, నేడు స్కూళ్లు ప్రారంభించిన రోజే జగనన్న విద్యాకానుక పేరుతో పుస్తకాలు, బెల్టు, షూ అందిస్తున్నారని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే పిల్లలతో సమానంగా యూనిఫాంతో బడులకు వెళ్లడం పట్ల వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జనపరెడ్డి రాజేశ్వరి, పొలిమేర దాసు, యువజన విభాగం అధ్యక్షుడు ఈదుపల్లి పవన్, మహిళా సమాఖ్య టూటౌన్ అధ్యక్షురాలు అమీనా అన్సారీ తదితరులున్నారు.

54వ సచివాలయం పరిధిలో..

జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమాన్ని చేపట్టారు. క్లస్టర్-1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందం, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో వినూత్న మార్పులు తీసుకువచ్చారని, పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. విద్యా కానుక, విద్యా దీవెన పథకాలతో పిల్లల చదువులకు ఊతమిచ్చారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు మంగమ్మ, విజయ్, నాయకులు ప్రభాకర్ నాయుడు, పచ్చిపులుసు సృజన్, ఎస్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే సమగ్ర అభివృద్ధి

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్ర సమగ్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 26వ డివిజన్‌లో 135వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా చేరుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని వృద్ధులు, మహిళలు, చిన్నారులను అనారోగ్యంతో బాధపడుతున్నవారిని పరామర్శించారు. కార్పొరేటర్ అద్దంకి హరిబాబు ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం పలికారు. పథకాలకు దూరమైన వారి సమస్యలను పరిష్కరించి ప్రతి అర్హుడికీ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నాని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిపదంలో నడిపించేందుకు శ్రమిస్తున్నారని వివరించారు. 2019లో అధికారం చేపట్టేనాటికి చంద్రబాబునాయుడు రాష్ట్ర ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే ఉంచి దిగిపోయాడని, ఆ నాటి నుంచి నాలుగున్నరేళ్లగా రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధిపనులు ఆగిపోకుండా నడిపిస్తోన్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. నాలుగున్నరేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదలకు రూ.2.44 లక్షల కోట్లు సంక్షేమ పథకాల పేరుతో సొమ్మును నేరుగా ప్రజలకే అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో నేడు వేలాది కోట్లు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు చూసి శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేడు అవే హామీలను అమలు చేస్తే సోమాలియా అవుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే నాని

15 నుంచి ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయంప్రతిపత్తి డిగ్రీ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ ఎర్నస్టీన్ ఫెర్నాండెజ్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 1953వ సంవత్సరంలో స్థాపించిన తమ కళాశాల విద్యా సేవలో 70 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, ఈ సందర్భంగా ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ విద్యా సంస్థ ప్రారంభించారన్నారు. తమ కళాశాల 36 సంవత్సరాల క్రితమే ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి అటానమస్ కళాశాలగా, దేశంలోనే 8వ అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందిందని తెలిపారు. తమ కళాశాల లక్షలాదిమంది మహిళలను విద్యావేత్తలుగా తీర్చిదిద్దిందని చెప్పారు. ఈ నెల 15,16 తేదీల్లో జరిగే ప్లాటినమ్ జూబ్లీ వేడుకల్లో తమ కళాశాల పూర్వ విద్యార్థులైన హోంశాఖ మంత్రి తానేటి వనిత, ఇస్రో చంద్రయాన్ 3 అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన కాళహస్తి, ఏపీ స్పెషల్ పోలీస్ డీఐజీ బి.రాజకుమారి, ఐఏఎస్ అధికారి వై.జయ ప్రియదర్శిని, సినీనటి, గాయని స్నిగ్ధ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకల ఆహ్వాన పత్రం విడుదల చేశారు. సమావేశంలో కళాశాల పరిపాలనాధికారి ఇన్యాసమ్మ, కెమిస్ట్రీ హెచ్ఓడీ సీపీ జ్యోతిర్మయి, హిందీ, తెలుగు హెచ్ఓడీ మహాలక్ష్మి పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఐఏఎస్‌లను వినియోగం సిగ్గు చేటు

ఏలూరు (టూటౌన్) : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ఐఏఎస్ అధికారులను వినియోగించడం సిగ్గు చేటని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ పేర్కొంది. ఈమేరకు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఐఏఎస్ అధికారులు, అన్ని శాఖల గ్రూప్ వన్, టూ అధికారులను వినియోగించడం గర్హనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అసలు ఈ రాష్ట్రానికి ఏం చేసిందని సిగ్గు లేకుండా ప్రచారం చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి గెలిచేందుకు ఐఏఎస్, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులను వినియోగించుకోవటం అభ్యంతరకరమని తెలిపారు. షెడ్యూల్ ప్రాంత గిరిజనుల సమస్యలపై రాజ్యాంగ ప్రకారం పర్యవేక్షించాల్సిన గవర్నర్ ఏనాడూ ఆ పనులు చేయలేదని, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఒక రాజకీయ నాయకునిలా రంగంలోకి దిగటం హాస్యాస్పదమని ఆరోపించారు. తక్షణం ఈ తప్పుడు వైఖరిని సరిచేసుకోవాలని తమ రాజకీయ ప్రయోజనాలకు ఐఏఎస్, జిల్లా అధికారులను వినియోగించుకోవటం ఆపాలని రవి డిమాండ్ చేశారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజూ కొనసాగింది. స్థానిక కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రజని, కార్యదర్శి దుర్గాభవాని, సీఐటీయూ నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు, కార్యదర్శి వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	74	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	74	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10-12
బెండకాయలు	60	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	48
కాకర కాయలు	40	కీరా దోస	40
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	68	అల్లం	120
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	48-60	పాలకూర	12
దొండకాయలు	50	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	45-55	గోంగూర	08
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	60	బఠాణి	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	25	చిలకడదుంప	34

ముగిసిన క్రిస్మస్ ఆరాధన పండుగలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన మన్నా చర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ ఆరాధన పండుగలు బుధవారం నాటితో ముగిశాయి. బిషప్ ఎలిషా రాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పండుగల్లో పాస్టర్ ఎం జ్యోతిరాజు, హైదరాబాద్ ది లార్డ్స్ చర్చ్‌కు చెందిన ప్రముఖ వర్తమానికుడు రాజ్‌పాల్ ప్రకాష్ వాక్య సందేశమిచ్చారు. రక్షణ సువార్త ప్రకటించారు. బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు నడిచిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని, సమాజంలో శాంతిస్థాపనకు క్రైస్తవులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నా చర్చ్‌కు చెందిన బాలలు, యవ్వనస్తులు పలు నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం మన్నా చర్చ్ క్వయిర్ ఆధ్వర్యంలో క్రీస్తు పుట్టుకకు సంబంధించిన గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎంఈఓలకు డీవైఈఓలుగా పదోన్నతి కల్పించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హైకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రంలో మండల విద్యాశాఖాధికారులకు ఉప విద్యా శాఖాధికారులుగా పదోన్నతి కల్పించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైకోర్టు తీర్పును అనుసరించి విద్యాశాఖలో పని చేసి బోధనానుభవం గల ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారులకు మాత్రమే ఉప విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు కల్పించాల్సి ఉందని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. నాయకులు మరడాని అచ్యుతరావు, గంగాధర రావు, ఉదయ భాస్కర్, ఆర్ నాగేంద్ర సింగ్ పాల్గొన్నారు.